# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

**<u>పత్రికా ప్రకటన</u>** **<u>తేది:25.8.2014</u>**

సింగపూర్ పర్యటన తనకు అద్భుత అనుభూతి కలిగించిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చెప్పారు. సింగపూర్, మలేషియా దేశాల పర్యటన ముగించుకొని హైదరాబాద్ కు వచ్చిన ముఖ్యమంత్రిని మంత్రులు తన్నీరు హరీష్ రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, జోగు రామన్న, డిప్యూటి స్పీకర్ పద్మా దేవెందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారితో తన పర్యటన అనుభవాలను, అనుభూతులను పంచుకున్నారు. సింగపూర్ దేశమంతా పచ్చిక బయళ్లతో కూడుకుని ఎంతో పరిశుభ్రంగా వుంటుందని, ఎక్కడా చిన్న కాగితపు ముక్క కూడా కనిపించలేదని వివరించారు.

ప్రతికూల పరిస్థితులను కూడా తట్టుకుని ఒ దేశం ఎలా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్లగలదో సింగపూర్ నిరూపించిందని కేసిఆర్ కితాబునిచ్చారు. కనీసం మంచినీళ్లు కూడా సింగపూర్ లో దొరకవని, ప్రతి వస్తువును ఇతర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోవాల్సిందేనని అలాంటి దేశం ఇవాళ ఆర్థిక ప్రగతిలో అగ్రరాజ్యమైన అమెరికా సరసన నిలిచిందని విశ్లేషించారు. కేవలం 53 లక్షల జనాభా వున్న సింగపూర్ దేశానికి ప్రతి ఏటా 5.30 కోట్ల మంది పర్యాటకులు వస్తున్నారని, ఇది ఆ దేశం ప్రపంచంలోని ఇతర దేశాలకు ఎలా స్ఫూర్తిగా నిలుస్తుందనడానికి నిదర్శనమని ముఖ్యమంత్రి చెప్పారు. మొత్తం దేశమంతా కలిసి 1.75 లక్షల ఎకరాల భూభాగమే వుందని, దేశానికి భూభాగం తక్కవగా వుండటం ఒ సమస్యగా మారిందని కేసిఆర్ చెప్పారు. ఈ సమస్యను కూడా సింగపూర్ అధిగమించిందని, సముద్రాన్ని వెనక్కి నెట్టి భూభాగాన్ని పెంచుకున్నదని కొనియాడారు.

ఒకప్పుడు 640 చ.కి.మీ. వెశాల్యం కలిగిన భూభాగం ఇప్పుడు 700 చ.కి.మీ.పైగా పెరిగిందని ఇది ఆ దేశం సాధించిన విజయాలలో ఒకటి అని వెల్లడించారు. ఏమి లేని స్థితి నుండి ప్రపంచాన్ని శాసించే స్థాయికి సింగపూర్ చేరుకోవడం వెనుక అక్కడి ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు, ప్రజల భాగస్వామ్యం వున్నాయని ముఖ్యమంత్రి అభినందించారు. సింగపూర్ దేశ డాలర్ మారకం విలువ మన దేశ కరెన్సీ రూపాయితో పోలిస్తే రూ.50/- వుందని, సింగపూర్

దేశ తలసరి ఆదాయం 50 మిలియన్ డాలర్లు అని కేసిఆర్ వెల్లడించారు. తక్కువ భూభాగం, తక్కువ వనరులు వున్న సింగపూర్ అంతగా అభివృద్ధి చెందినప్పుడు విశాల భూభాగం, అపార వనరులు వున్న మన దేశం ఎందుకు అభివృద్ధి చెందడం లేదని బాధ కలిగిందని కూడా తన అనుభూతిని కేసిఆర్ పంచుకున్నారు. నిజానికి సింగపూర్ ఒకప్పుడు మూడో ప్రపంచ దేశాలలో ఒకటని, కాని ఈనాడు అది అభివృద్ధి చెందిన దేశమని వెల్లడించారు. సింగపూర్ ను ఈ స్థాయికి తీసుకువచ్చిన ఘనత ఆ దేశ మొదటి ప్రధాని లీ క్వాన్ యూ (Lee Kuan Yew) కు దక్కుతుందన్నారు. లీ క్వాన్ యూ రాసిన "సింగపూర్ ఫ్రమ్ థర్డ్ వరల్డ్ టూ ఫస్ట్" అనే పుస్తకాన్ని తాను 1995 లోనే చదివానని, ఇప్పుడు ఆ దేశాన్ని స్వయంగా చూశానని కేసిఆర్ చెప్పారు. మన ప్రాంతంలో కూడా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు చేసే వుద్దేశ్యంతోనే తాను జన్మభూమి అనే పథకానికి రూపకల్పన చేసినట్లు వెల్లడించారు. సింగపూర్ ను చూసి నేర్చుకోవలసింది ఎంతో వుందని కేసిఆర్ అభిప్రాయపడ్డారు. లీ క్వాన్ యూ రాసిన పుస్తకాన్ని తెలుగులో అనువదించాలనుకుంటున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రపంచంలో యువకులు ముఖ్యంగా సింగపూర్ కు సంబంధించిన వారు ఒకనాటి సింగపూర్ ఎలా ఉండేది ఇప్పుడు ఎలా ఉంది అనే విషయాలు తెలుసుకుంటారని, ఇది అభివృద్ధిని కోరుకునే దేశాలకు, పౌరులకు అవసరమైన పాఠం అని సిఎం అభిప్రాయపడ్డారు. భూమి కొరత, సహజ వనరుల కొరత వున్నా చైనా, ఇండియా, డచ్, బ్రిటీష్, తదితర దేశాల నుండి వచ్చిన వారితో సింగపూర్ ను ఓ అద్భుత దేశంగా ఎలా తీర్చిదిద్దారో కూడా ఈ బుక్ లో ఉందని చెప్పారు.

సింగపూర్ దేశాన్ని పర్యటించటం ద్వారా తాను ఎంతో నేర్చుకోగలిగానని, తెలంగాణకు చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పి చైర్ పర్సన్లు కూడా ఆ దేశాన్ని సందర్శించి శిక్షణ పొందాలని కేసిఆర్ ఆకాంక్షించారు. తమ ప్రజా ప్రతినిధులను సింగపూర్ పంపుతానని, అప్పుడు వారికి స్వయంగా శిక్షణ ఇవ్వాలని ఆదేశ ప్రధాని లీ సీన్ లూంగ్ (Lee Hsien Loong)ను కోరారని ముఖ్యమంత్రి చెప్పారు. బడ్జెటు సమావేశాల తర్వాత తెలంగాణ ప్రజా ప్రతినిధులు సింగపూర్ పంపే ఆలోచన ఉన్నట్లు కూడా ముఖ్యమంత్రి వెల్లడించారు. సింగపూర్ తోపాటు పక్కనే ఉన్న మలేషియా కూడా గొప్పగా అభివృద్ధి చెందిందని కె.సి.ఆర్. అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య ఉన్న వారధి గుండా తాను కారులో ప్రయాణం చేసానని దీని వలన అక్కడి పరిశ్రమలు, వాతావరణం, ఇతర జనావాసాలను స్వయంగా చూసే అవకాశం దక్కిందన్నారు. మలేషియా కూడా యేటా 2.7 కోట్ల మంది పర్యాటకులను ఆకర్షిస్తోందన్నారు. సింగపూర్ లో స్థిరపడిన ఇతర దేశాల పౌరులు కూడా తాము సింగపూర్ వాసులమే అని

గర్వంగా చెప్పుకోవడం తనను ఆకర్షించిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా తాను అనేక మందిని కలుసుకున్నానని, గ్రూప్ మీటింగ్ లో కూడా పాల్గొన్నానని చెప్పారు. ఆయా సందర్భాలలో ప్రతి ఒక్కరు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యంగా పారిశ్రామిక అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారని ముఖ్యమంత్రి చెప్పారు.

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక విధానం సరళంగా, పారదర్శకంగా, అవినీతి రహితంగా ఉంటుందని, అనుమతుల కోసం సింగిల్ విండో, చేజింగ్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పడంతో వారంతా ఎంతో అభినందించారని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణకు పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని అక్కడి వారు అభిప్రాయపడినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. సింగపూర్ లోని అన్ని రంగాల ప్రగతి పై అధ్యయనం చేసానని, ఇది తెలంగాణ పునర్నిర్మానానికి ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

-----------------------------------------------------------------------

**సిపిఆర్ఓ టూ సిఎం**